వున్న దగ్గరకు వెళ్ళి అక్కడ వున్న వాళ్ళతో "సార్ ,జాగ్‌వార్‌ను నేలమాళిగ వాకిలి ముందు వుంచమన్నారు'' అంటూ బోనును నేలమాళిగ వాకిలి ముందుకు తోయించాడు .బోను స్ప్రింగ్ తలుపులు స్విచ్ నొక్కగానే తెరుచుకుని పెద్దపులి బయటకు వచ్చే ఏర్పాటు చేయబడి వుంది.

''జానీ! ఎవరయినా పోలీసులు ఈ ప్రాంతాలకు వచ్చి నేలమాళిగ తలుపు తీయమంటే వెంటనే స్విచ్ నొక్కు! ఆకలితో నకనక లాడుతున్న జాగ్‌వార్ కనపడ్డవాళ్ళను ఖైమా వుండలు నమిలినట్లు నమిలి వేస్తుంది!'' అని చెప్పి వెళ్ళిపోయాడు అయ్యంగార్.

నిమీలిత, హెలెన్‌లను వుంచిన అంతఃపురం మేడ ఆవరణలో 'లిపార్డ్' అనే భయంకర జాగిలాన్ని కట్టి వేయించాడు అయ్యంగార్. వంటిమీద మచ్చలున్న ఆ భయంకరమైన కుక్క దూరాన్నుంచి చూడడానికి చిరుతపులిలా వుంటుంది. చిరుతపులి ఫేనిష్ హౌండ్ల సంకరజాతికి చెందిన ఆ 'కుక్క' నాలుగడుగుల పొడవు నాలుగడుగుల ఎత్తు వుండి భయంకరంగా గర్జిస్తూ ఒక్క వుదుటున పదిహేను అడుగుల దూరం ఎగిరి దుముకగలదు!

''ఇక ఆ శశాంకగాడు కాదుగదా వాడి తలలో జేజి కూడా ఈ ప్రాంతాలకు రాలేడు'' అనుకుంటూ వికృతంగా నవ్వుకుంటూ వెళ్ళాడు అయ్యంగార్ సార్ వద్దకు.

** ** **

ఎస్.పి. రామనాథం, సి.ఐ. రావు, సి.ఐ. కృష్ణ వున్న పోలీసు బృందం ఒక వాను, ఆరు జీపులు కోట సింహద్వారం వద్దకు వచ్చే సరికి కోట తలుపులు తెరిచి వుంచారు సెంట్రీలు. వాన్, జీపులు కోట ఆవరణ లోపలకు వచ్చి ఆగగానే ప్రసన్నవదనాలతో షంషేర్, ధవళహాసలు వచ్చి ఎదురుగా నిలుచున్నారు.

''నమస్తే ఎస్.పి. సాబ్! తమరాకతో మా రోజ్ ఫ్లవర్ ప్రొడక్షన్స్ యూనిట్ ధన్యత చెందింది. మీరు కల్పించిన రక్షణతో ఇంతవరకు మా యూనిట్ షూటింగ్ నిరాటంకంగా సాగిపోయింది! ఇక ముందు కూడా మాకు మీ సహకారం వుంటుందని ఆశిస్తున్నాను'' అంటూ రెండు చేతులు జోడించి నమస్కరించాడు షంషేర్.

వాన్‌నుండి కిందకు దిగిన రామనాథం కోట ఆవరణ నలుమూలలూ పరిశీలనగా చూస్తూ ''మీరిక్కడ సినిమా షూటింగ్ మొదలెట్టి ఎన్నాళ్ళయింది?'' అని అడిగాడు షంషేర్‌ను.

''హి! హి! రెండు నెలలయింది!'' అన్నాడు షంషేర్.

''మీ షూటింగ్ షెడ్యూలు ప్రకారం సాగుతున్నదా? అన్నట్లు మీ సినిమా పేరేమిటి?''

''తమ దయవల్ల షూటింగ్ నిరాటంకంగా సాగుతున్నది! మా సినిమా పేరు 'మహారాజా'!''

''హాలీవుడ్ నిర్మాత వచ్చి యింత అట్టహాసంగా సినిమా తీస్తుంటే ఇక్కడ పేపర్లలో ఏ మాత్రం పబ్లిసిటీ ఇవ్వలేదేం?''

హాలీవుడ్‌లోనే యం.జి.యమ్. వాళ్ళు మాతో పోటీగా సినిమా తీయాలని ప్లాన్‌లో వున్నారు. అందుకని వాళ్ళకు తెలియకుండా వుంటానికని మా సినిమా విషయం రహస్యంగా వుంచాము''.

''అలాగా!''

''అవున్సార్! తమ దయవల్ల మా షూటింగ్ నిరాటంకంగా సాగిపోయిందింతవరకూ! ఇంకా కొద్ది రోజులుంటే మా షూటింగ్ పూర్తవుంతుంది! హాలివుడ్ వెళ్ళి ఇన్‌డోర్ షూటింగ్ పూర్తి చేస్తాం!''

''అలాగా మీ సినిమాలో హీరో, హీరోయిన్లెవరు?''

ఇద్దరూ కొత్తవాళ్ళు!

''హీరో, హీరోయిన్లు మద్రాసులో వున్నారు. కొద్ది రోజులలో షూటింగ్‌లో పాల్గొనే నిమిత్తం ఇక్కడకు వస్తారు''

''ఇన్నాళ్ళు హీరో, హీరోయిన్లు లేకుండా షూటింగ్ తీసారన్నమాట!'' భావగర్భితంగా నవ్వుతూ అన్నాడు రామనాథం.

(సశేషం)

అమృతకలశం క్రైం కథల పోటీలో ఎన్నికైన కథ

# ది మిస్టరీ

దూరం నుంచి బూట్ల చప్పుడు... ... ... ... క్రమేపి దగ్గరవుతోంది.

ముందుగా వేసుకున్న మాస్టర్ ప్లాన్ దృష్ట్యా ఉలిక్కి పడ్డాడు ఫార్మసిస్టు సందీప్.

వస్తున్నది వాడే! ధర్మశాస్త్రం చదివిన రావణా సురుడులాంటి డాక్టర్ చిత్రకాంత్.

అనుకున్న ప్రకారం టేప్ రికార్డర్ బటన్ నొక్కాడు మాటలు రికార్డు కావడానికి. తను కూర్చున్న కుర్చీ క్రిందకి తోసాడు దానిని.

''ఒరేయ్ చిత్రకాంత్. అమాయక రోగులను మోసంచేసి గవర్నమెంట్‌వారు ఇస్తున్న మందుల్ని నా ద్వారా సుపీరియారిటీగా కాజేస్తావు కదూ. ఈ రోజుతో నీ ఆట కట్టు. నీ నుండి ఈ హాస్పిటల్‌కి విముక్తి లభింపచేస్తాను'' మనస్సులో అనుకుని పళ్ళు పటపట మని కొరికాడు.

అంతలోనే వచ్చాడు చిత్రకాంత్. గబుక్కున లే విష్ చేశాడు సందీప్ ఏమీ ఎరగనట్టు.

''గుడ్ మార్నింగ్ సార్''.

''గుడ్ మార్నింగ్''.

''కూర్చోండి సార్''.

కూర్చున్నాడు చిత్రకాంత్. ఆ డ్రగ్ స్టోర్‌లో వున్నది ఒక కుర్చీ మాత్రమే. ఫేన్ వుండేది కాని, అది ఈ మధ్య డాక్టర్‌గారి ఇంట్లో వుంటున్నది!

''సందీప్.''

''ఏమిటండి?''

''వచ్చే పేషంట్లకు స్ట్రెప్టోమైసిన్ స్టాకు లేదని చెప్పు.''

''అదేంటి సార్. సప్లయి వుంది'' క్రొత్తగా- అన్నాడు.

''ఉష్! అది నాకు తెలుసు. లిస్టులో పేషంట్లకు ఇస్తున్నట్టు వ్రాయి. వాళ్ళు వస్తే లేదని చెప్పు. సాయంత్రం అయ్యాక వార్డుబాయి వస్తాడు. వున్న స్ట్రెప్టోమైసిన్‌ని మా మెడికల్ స్టోర్‌కి పంపించు.''

''అది అన్యాయం సార్.''

''ఏమిటోయ్, పెద్ద పెద్ద మాటలాడుతున్నావ్.'' ఇకమీదట అలా జరగడానికి వీల్లేదు.''

''ఏం! పోస్టు నుంచి డిస్మిస్ అవ్వాలని వుందా, లేక ఏజెన్సీకి బదిలీ అవ్వాలని వుందా.''

''నాకు ఆ భయం లేదు.''

''ఎందుకని?''

''నీ పోస్టుకి ఇకపై సెక్యూరిటీ లేదు కాబట్టి.'' అతడు ఉపయోగించిన ఏకవచనానికి మండిపడ్డాడు.

''వ్వాట్ రబిష్ యుఆర్ బ్లడీ టాకింగ్!?''

''అవును చిత్రకాంత్. ఇప్పుడు నీ గుట్టు నా చేతుల్లో వుంది.''

''వ్వాట్?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''ఇదిగో నువ్వన్న మాటలన్నీ ఈ టేపులో భద్ర పరచబడ్డాయి. పై అధికార్ల దగ్గరకు వెళ్ళడమే తరు వాయి.'' ప్లగ్‌ను లాగి కుర్చీ క్రింద టేపును బయటకు లాగాడు. చిత్రకాంత్ షాకు నుండి తేరుకోక ముందే సందీప్ కాళ్ళమీద పడ్డాడు. ఎన్నోవిధాల అర్థించాడు. మరోసారి అన్యాయానికి పాల్పడితే ఆ టేపును పై అధికార్ల ముందు పెట్టమని శరణు వేడుకున్నాడు.

సందీప్‌కి సమ్మతమయింది. ఏవో రెండు హితవులు చెప్పి డాక్టర్ని పంపేసాడు. కాలు కాలిన పిల్లిలా అతడు వెళ్ళిపోయాడు.

''రాస్కెల్‌కి రోగం కుదిరింది. ఈ టేపును 'మాయలఫకీరు' ప్రాణంలా దాయాలి'' అనుకుని, ఎలా రికార్డయిందోనని ఒకసారి వినడానికి ప్లే బటన్ నొక్కాడు. అంతే! పది నిముషాల తర్వాత అతని హృదయస్పందన ఆగినంత పనయింది.

-అప్పటికే కరెంట్‌పోయి అరగంటయింది!!! వచ్చింది.

కొల్లిమల్ల అప్పారావు